క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఏడీఏ, అధ్యాపకులు

ఉరవకొండ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉరవకొండ ఏడీఏ సత్య నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఏడీఏ మొక్కలు నాటారు. ఏడీఏ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ సంస్థ రైతుల అభ్యున్నతికి పాటు పడుతూ మొక్కల సంరక్షణకు ఎంతో శ్రమిస్తుందన్నారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, అధ్యాపకులు రామాంజనేయులు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీతోనే పేదల అభ్యున్నతి

కుందుర్పి: వెనుకబడిన అనంత జిల్లాలో ఆర్డీటీ ద్వారానే పేదల అభివృద్ధి సాధ్యమని నాబార్డు డీడీఓ అనురాధ తదితరులు పేర్కొన్నారు. సోమవారం మాయదార్లపల్లిలో సంస్థ రూ.1.40 లక్షలతో నూతనంగా నిర్మించిన శుద్ధజల తాగునీటి పథకాన్ని స్థానిక సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో ప్రారంభించారు. కుందుర్పి మండలంలో వెనుకబడిన పంచాయతీలైన బసాపురం, జంబుగుంపల, నిజవళ్లి, కుందుర్పి పంచాయతీల్లో ఆర్డీటీ సహకారంతో నాబార్డు నిధులు రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు జరగడం హర్షణీయమన్నారు. ఆర్‌డీటీ సిబ్బంది భాస్కర్ బాబు, మండల వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మాయదార్లపల్లి వాటర్ షెడ్డు చైర్మన్ నాగభూషణ సిబ్బంది పాల్గొన్నారు.

'చలో విజయవాడ'పై బైక్ ర్యాలీ

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 4న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. స్థానిక వినాయక సర్కిల్ నుంచి లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు, కేబీ ప్యాలెస్‌రోడ్డు, నేతాజీ రోడ్డు మీదుగా శాంతినగర్ వరకు జరిగింది. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక యూనియన్ నాయకులు తిప్పేరుద్ర, నరసింహులు, మైలారి, శివానంద, శ్రీనివాసులు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, సత్వరమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. డివిజనల్ స్థాయి అధికారులు శాఖల వారీగా వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సత్వర న్యాయం చేయాలన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

కుందుర్పి: ఎనుములదొడ్డిలో అత్యంత వైభవంగా పీర్ల పండుగ జరగనుంది. శనివారం పెద్దసరిగెత్తు, ఆదివారం జలధి ఉత్సవంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఎనుములదొడ్డితో పాటు కంబ దూరు మండల మరిమాకులపల్లి, రుద్రంపల్లి దేవుళ్ల ఆదివారం ఉదయం ఒకే చోట భేటీ అవుతాయి.

నేటి నుంచి లాలుస్వామి ఉత్సవాలు

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురంలో జిల్లాలో అత్యంత పేరుగాంచిన లాలుస్వామి పీర్ల దేవుడి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 1వతేదీ నుంచి 6వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. 1న లాలుస్వామి పీర్ల పెట్టె మెరవణి, 3న చిన్న సరిగెత్తు, 5న పానకాలు, పెద్దసరిగెత్తు, 6న పీర్ల ఊరేగింపు, జలధికి వెళ్లడం, 8న చివరి దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

గురుకుల పాఠశాల తనిఖీ

వజ్రకరూరు/ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని రాగులపాడులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను తహసీల్దార్ నరేష్ కుమార్,ఎంపీడీఓ శివాజీరెడ్డి, ఎస్ఐ నాగస్వామి, ఏఓ మధుకర్, బంజారా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే కేశవనాయక్ సోమవారం తనిఖీ చేశారు. రాగులపాడు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించలేదని, తరగతులు సక్రమంగా జరగలేదని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అధికారులు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని పరిస్థితిపై బంజారా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు కేశవనాయక్ ఫోన్ ద్వారా డీటీడబ్ల్యూఓ రామాంజనేయులుకు వివరించారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు సుబ్రమణ్యం నాయక్, ఎర్రిస్వామినాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

నాడు భరోసా.. నేడు నిరాశ

కౌలు రైతులకు పెట్టుబడి సాయమేదీ?

- అన్నదాత సుఖీభవ జాబితాలోనూ నిరాశే
- సీసీఆర్ కార్డులు సిద్ధం చేసుకొని ఎదురుచూపు



ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు (ఫైల్)

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా రైతు భరోసా అందుకున్న కౌలు రైతులు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిరాశ చెందుతున్నారు. కౌలు రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం విషయంలో మొండిచేయి చూపుతోంది. పెట్టుబడి సాయాన్ని రైతులకు అందించేందుకు సిద్ధం చేసిన జాబితాలో ఒక్క కౌలు రైతు పేరు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అధికారంలోకొచ్చిన తొలి ఏడాది పథకాన్ని విస్మరించి రెండో సంవత్సరంలోనూ రైతులకే అందించేలా చర్యలు చేపడుతున్నా ఇందులో కౌలు రైతుల ప్రస్తావనే లేదు. సీసీఆర్ కార్డులు సిద్ధం చేసుకొని పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 11,200 మంది రైతులు ఉన్నారు. వీరందరూ వైఎస్సార్‌సీపీ హయాంలో పెట్టుబడి సాయం పొందారు. అయితే కూటమి ప్రభుత్వం కౌలు రైతు ప్రస్తావన లేకపోవడంతో పాటు సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ నేటికీ అందుబాటులోకి రాలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 'భరోసా'

2019 అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలతో కలిపి జగనన్న ప్రభుత్వం రూ.7,500 కలిపి రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందించింది. కౌలు రైతులకు నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వమే భరించి కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించింది.

కూటమి హామీ నీటి మూటేనా..?

గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీ హామీలతో ఊదరగొట్టాయి. తాము అధికారంలోకొచ్చాక కేంద్ర ప్రభుత్వ వాటా రూ.6 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలు కలిపి రూ.20 వేలు రైతులతో పాటు కౌలు రైతులకు కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతులు వెంటనే సీసీఆర్ కార్డులు సిద్ధం చేసుకోండి..అధికారంలోకి రాగానే మీ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ప్రస్తుతం కౌలు రైతుల ఊసే ప్రభుత్వం ఎత్తడం లేదు.

ప్రస్తావనేదీ..?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకూ రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో కౌలు రైతులు దీని కోసం ఎదురుచూస్తుంటే ఇప్పటి వరకు కౌలు రైతుల ప్రస్తావన కూడా ప్రభుత్వం తీసుకురాలేదు. ముఖ్యమంత్రి కౌలు రైతులకు మోసం చేయాలని చూస్తోంది. – రంగారెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉరవకొండ

ఆదుకోవాలి



కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు పెట్టుబడులకు అప్పు చేసి పెట్టి గిట్టుబాటు ధరలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తించలేదు. – వెంకటేష్, కౌలు రైతు, పెద్దముష్టూరు గ్రామం

సమాచారం లేదు



అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్ సైట్ అందుబాటులోకి రాలేదు. ఈవిషయంపై స్పష్టత లేదు. – రామకృష్ణుడు, వ్యవసాయ శాఖ అధికారి, ఉరవకొండ

ఏకపక్షంగా రూ.3 కోట్లు కేటాయిస్తారా?



నిధుల కేటాయింపుపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ గౌని లావణ్య, శారదాదేవి

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘానికి మంజూరైన రూ.3 కోట్లు స్పెషల్ గ్రాంటు, ఇందిరమ్మ లేఅవుట్లలో లబ్ధిదారులకు నోటీసులపై సోమవారం కౌన్సిల్ హాల్‌లో సాధారణ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. కౌన్సిలర్లకు సమాచారమివ్వకుండా , ఏ మేరకు నిధులు కేటాయిస్తున్నారో కనీసం చర్చించకుండా ఏకపక్షంగా అజెండాలో అభివృద్ధి పనులను పొందుపరచడంపై కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, బండి అజయ్, శారదాదేవి, పైతోట సంజీవప్ప, ఐనాపురం మంజునాథ, డిష్ గోవిందు తదితరులు అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత అజెండాలోని అంశాలను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించారు. అనంతరం అజెండాలోని 4వ అంశంపై పలువురు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ గోవిందరాజు మాట్లాడుతూ స్పెషల్ గ్రాంట్ రూ.3 కోట్ల నిధుల్లో మొత్తం 32 వార్డులకు గాను 14 వార్డుల్లో పైసా నిధులను కేటాయించకపోవడంపై మండిపడ్డారు. కొన్ని వార్డుల్లో రూ.30 నుంచి 50 లక్షల దాకా నిధులు కేటాయించిన అధికారుల తీరుపై మండిపడ్డారు. కౌన్సిలర్ గౌని లావణ్య మాట్లాడుతూ తన వార్డులో గతంలో గడపగడపకూ కింద మాత్రమే అభివృద్ధి జరిగిందని, దీన్ని పట్టించుకోకుండా ఏమాత్రం నిధులు కేటాయించకపోవడం ఏమిటని నిలదీశారు. అధికారులు ఇలానే ప్రవర్తిస్తే తాను రాజీనామా చేస్తానన్నారు. స్పందించిన చైర్‌పర్సన్ సదరు అంశాన్ని వాయిదా వేశారు.

జీరో అవర్‌లో సమస్యల ప్రస్తావన...

కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి రూ.5 లక్షలు ఖర్చు పెట్టారని, ఖర్చుల వివరాలు ఎందుకు పొందుపరచలేదని నిలదీశారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. పట్టణంలోని ఇందిరమ్మ లేఅవుట్‌లలో దాదాపు 700 మందికి పైగా లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు తాశ సాబిరాబీ, గోవిందరాజులు, బండి అజయ్, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ అర్హుల స్థలాలను తొలగించమని, వారి పేరుమీదనే ప్లాట్ ఉంటే కట్టుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ డీఈ సురేష్, ఏఈలు నరసింహులు, ప్రతాప్, టీపీఎస్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

2న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వజ్రకరూరు: ఉరవకొండ వీరశైవ కళ్యాణ మంటపంలో ఈనెల 2న వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్యనేతలతో సమావేశం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ అనుబంధం సంఘాల నాయకులు, ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ 2న ఉరవకొండలో నిర్వహించనున్న సమావేశానికి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నరేష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం అనుబంధ సంఘాల కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తిప్పారెడ్డి, కిష్టన్న, తట్రకల్లు చంద్ర,కుళ్లాయిస్వామి, జాఫర్, రఘుపతి, బెస్త ఆది, హరినాథరెడ్డి, బసవన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు తెలుసుకోవాలి

గుమ్మఘట్ట: ప్రతి ఒక్కరూ పౌరహక్కులను తెలుసుకోవాలని డీటీ రఘు, ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం మండలంలోని సిరిగెదొడ్డి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. పగలు, ప్రతీకారాలు, కక్షలు, గొడవల జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలన్నారు. ఆర్ఐ రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేష్‌కుమార్, ఎస్ఐ నాగస్వామి తదితరులు హెచ్చరించారు. రాగులపాడులో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్ కుమార్, ఎస్ఐ నాగస్వామి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివాజీరెడ్డి, సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచు రామాంజనేయులు, ఏఓ మధుకర్, ఎంఈఓ ఎర్రిస్వామి, ఏఈఓ భరత్‌రాజు, వీఆర్వో భరత్, హాస్టల్ వార్డెన్ నాగరాజు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండలో తీవ్ర తాగునీటి ఎద్దడి



ఎస్ఎస్ ట్యాంకులో పుష్కలంగా ఉన్న నీరు



ఉరవకొండ శివారులోని బోర్ల వద్ద ఇలా..

ఉరవకొండ: పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో రెండు నెలలుగా తాగునీరు సరఫరా కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్వయనా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణానికి నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, పీఏబీఆర్ లోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకుల్లో 3 ట్యాంకులు ఉండగా, ఒకటి పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండు ట్యాంకుల్లో నీరున్నా వాటిని సక్రమంగా వినియోగించడంలేదు. దీనికితోడు పీఏబీఆర్‌లోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు రెండు నెలలుగా ఉరవకొండకు సరఫరా కాలేదు. దీంతో నింబగల్లు ట్యాంకు నీటిని వాడుకోవాల్సి ఉంటుంది.

సాంకేతిక కారణాలు సాకుగా చూపి..

తాగునీటి సరఫరా ఎప్పుడు చేస్తారంటూ ఆయా కాలనీవాసులు రోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈతో పాటు సిబ్బంది ఒక్కరు అందుబాటులో లేరు. ట్రాన్స్‌ఫార్మర్‌లు, మోటార్లు కాలిపోయాయని సాకులు చూపుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

వేతనాలు ఇవ్వండి మహాప్రభో

కళ్యాణదుర్గం: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వండి మహాప్రభో అంటూ సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పంపుహౌస్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. బకాయి వేతనాలు, పీఎఫ్ వేతనాలు ఇవ్వాలని గత 85 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. పీఏబీఆర్ నుంచి సరఫరా చేసే కార్మికులకు 6 నెలల వేతనం, 26 నెలల పీఎఫ్ బకాయి ఉందన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం నుంచి పైసా కూడా చూడలేదని స్పష్టం చేశారు. వేతనాలు రాక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సంఘం నాయకులు పెద్ద ఎత్తున పోరాటాలు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

వజ్రకరూరు: ఉపాధిహామీ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్‌కుమార్‌ను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి, సీఐటీయూ నాయకులు సుధాకర్, రంగమ్మ బ్రహ్మయ్య, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో పశుదాణా పంపిణీ

బొమ్మనహాళ్: పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశుదాణాను పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్యశాల వద్ద 150 మంది పాడి రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువుల దాణా 50 కేజీల బస్తా ధర రూ.1,110 కాగా, 50 శాతం సబ్సిడీతో రైతుకు కేవలం రూ. 555లకే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. శ్రీధరఘట్ట పశువైద్యాధికారి మనోహ్మన్‌రెడ్డి, పాడిరైతులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డి.హీరేహాళ్ మండలంలోని హొసగుడ్డం శివారులో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24,800 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన మహబుబ్ బాషా (38) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మహబూబ్‌బాషా పట్టణంలోని టీసర్కిల్‌లో ఆదివారం రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్వతీపరమేశ్వరులకు రుద్రాభిషేకం

కూడేరు: స్థానిక జోడు లింగాల సంగమేశ్వర స్వామి క్షేత్రంలో ఆలయ అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వామి సోమవారం రుద్ర, క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం పలు రకాల పుష్పాలతో అలంకరించారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలివచ్చి జోడులింగాలను దర్శించుకున్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతులు

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అధికారులకు వినతులు అందజేశారు. డీటీ ఉదయ్ భాస్కర్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏఓ శుభకర్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఓ పోలేరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీలో 50 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 2న సాయంత్రం ఐదు గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. 4న ఉదయం 10 గంటలకు డెమో క్లాసు ఉంటుందన్నారు.



మర్రిస్వామి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



రమణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



రాయదుర్గం: ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం



సురేష్‌బాబు దంపతులకు సన్మానం

మర్రిస్వామి సేవలు మరువలేనివి

బ్రహ్మసముద్రం : వీఆర్వో మర్రిస్వామి సేవలు అభినందనీయమని ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పిల్లలపల్లి రెవెన్యూ గ్రామ వీఆర్వో కరణం మర్రిస్వామి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మర్రిస్వామి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. సుమతి, కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, డీటీ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు వేణు, నాగరాజు, లక్ష్మన్న, మల్లికార్జున, రామకృష్ణ, అంజి పాల్గొన్నారు.

రమణారెడ్డి సేవలు ఎనలేనివి

కూడేరు: సోషల్ టీచర్ రమణారెడ్డి సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. జల్లిపల్లి హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న రమణారెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. హెచ్ఎం కవిత అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

రాయదుర్గంటౌన్: ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని, విధుల్లో ఉన్న కాలంలో చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన మేస్త్రీ భైరప్ప, పీహెచ్ వర్కర్ గిరిధర్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. డీఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సీనియర్ అకౌంటెంట్ ఈశ్వర్, మేనేజర్ కిశోర్ తదితరులు హాజరయ్యారు.

సురేష్‌బాబు సేవలు అమోఘం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం సురేష్‌బాబు సేవలు అమోఘమని సర్పంచు అతావుల్లా, ఉపాధ్యాయులు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎం సురేష్‌బాబును స్థానిక పాఠశాలలో సోమవారం సన్మానించారు. ఏపీటీఎఫ్ నాయకులు తిమ్మప్ప ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ గూడెన్నకు ఉద్యోగుల సన్మానం

కళ్యాణదుర్గం రూరల్: గూడెన్న సేవలు మరువలేనివని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. సోమవారం కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గూడెన్న ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీమేష్, గంగాధర్, వినియోగదారుల సంఘం రాష్ట్ర నాయకుడు చల్లా కిశోర్, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

70 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ఆయా కంపెనీల ప్రతినిధులు, అధికారులు

ఉరవకొండ: స్థానిక మహాత్మా డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సీడాప్ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా జరిగింది. ఈసందర్భంగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, ప్రిన్సిపాల్ బసవరాజు ఆధ్వర్యంలో నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జాబ్‌మేళాకు 140 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా 70 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎల్ఎంఎస్ కంపెనీకు 8 మంది, సుజిలాన్‌కు 8 మంది, అపోలోకు 8 మంది, వరుణ్ ఫర్టిలైజర్స్‌కు ఏడుగురు, అమోజాన్‌కు 18 మంది, యంగ్ ఇండియాకు 10 మంది, టాటా కంపెనీకు 5 మంది, స్పందనకు 10 మంది, టాటా ఎల్రక్టానిక్స్‌కు ఆరుగురు, కియాకు ఒకరు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు ఆయా కంపెనీల ప్రతినిధులు అందజేశారు.

పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమవారం డీహీరేహాళ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు రహంతుల్లా, నాయకులు జగదీష్, హనుమంతరెడ్డి, బసప్ప, శంకరప్ప, కరిడి మల్లికార్జున. వన్నూరుస్వామి, లింగప్ప, శివారెడ్డి, సర్మస్ వలి, హరిజన కృష్ణప్ప, ఎర్రిస్వామి, మహేష్ పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌ఆర్‌సీఏను పునరుద్ధరించాలి



ఆర్డీటీకు ఎఫ్‌ఆర్‌సీఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

ఉరవకొండ: కరువు పీడిత ఉమ్మడి అనంతపురం జిల్లాలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆర్డీటీ చేస్తున్న సేవలను గుర్తించి సంస్థ ఎఫ్‌ఆర్‌సీఏను పునరుద్ధరించాలని అఖిలభారత బంజారా సేవా సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆర్డీటీ పరిరక్షణ కోసం భవిష్యత్తులో చేపట్టబోవు కార్యచరణపై సమావేశం నిర్వహించారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అఖిలభారత బంజారా సేవా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు ఎస్‌కే కేశవనాయక్, ఎస్‌కే సుబ్రమణ్యం నాయక్, ఎస్సీ, ఎస్టీ ఐక్య నాయకులు మీనుగ గోపాల్, పాల్తూరు ఆనందరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఆర్డీటీని పరిరక్షించాలని నిరసన ర్యాలీ



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఆర్డీటీని పరిరక్షించాలని నిరసన ర్యాలీ సోమవారం నిర్వహించారు. మండలంలోని కొంతానపల్లికి చెందిన ఆర్డీటీ లబ్ధిదారులు, ప్రజలు వినాయక సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

ఎవరి వైద్యం వారే చేసుకోవాలంట!



వృద్ధురాలి కాలి గాయాన్ని శుభ్రం చేస్తున్న బంధువు

కళ్యాణదుర్గం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎవరైనా గాయాలతో వెళితే వారి వైద్యం వారే చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గాయాలను శుభ్రం చేసి, కట్టు మార్చేందుకు వైద్య సిబ్బంది నిరాకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సోమవారం ఉదయం ఓ వృద్ధురాలు కాలికి తగిలిన గాయానికి కట్టు మార్చుకునేందుకు సీహెచ్‌సీకి తన బంధువుతో కలసి వెళ్లింది. గాయానికి చికిత్స చేసే గదిలోకి వెళితే... సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వృద్ధురాలి కట్టును తొలగించి శుభ్రం చేసుకుంటే మందు వేస్తానని తేల్చి చెప్పడంతో చివరకు వృద్ధురాలి గాయాన్ని తోడు వెళ్లిన బంధువు శుభ్రం చేసి, మందు రాసి, కట్టు కట్టింది. ఈ దృశ్యం చూసిన పలువురు కూటమి ప్రభుత్వంలో వైద్య సేవలు నానాటికీ తీసికట్టుగా మారాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. సోమవారం ఏలంజి గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో గ్రామస్తులతో పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు.